క్లుప్తంగా

బుగ్గరామేశ్వర ఆలయానికి రూ.58,116 విరాళం


విరాళం అందజేస్తున్న దృశ్యం

ఓర్వకల్లు : మండలంలోని కాల్వబుగ్గ గ్రామంలో వెలసిన శ్రీబుగ్గరామేశ్వరస్వామి ఆలయానికి సోమవారం ఓ భక్తుడు రూ.58,116 విరాళం అందజేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయంలో నిత్యాన్నదాన సత్రానికి భక్తుల సౌకర్యార్థం కర్నూలు వాస్తవ్యులు చింత కుంట చిన్న లక్ష్మయ్య, ఆయన సతీమణి జయమ్మ రూ.58,116ల విరాళం సొమ్మును ఆలయ ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్, ఆలయ ప్రధాన అర్చకులు కల్లె లక్ష్మీనారాయణశర్మకు అందజేశారు. దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

గడివేముల: పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని వైద్యాధికారిణి మొల్లా జబీనా అన్నారు. సోమవారం నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన గడివేములతో పాటు బూజునూరు గ్రామాల్లోని పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఆల్బెండజోల్ టాబ్లెట్స్‌ను అందించారు. మండలంలో చదువుతున్న విద్యార్థులందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు.

పీహెచ్‌సీలో మొక్కలు నాటిన అధికారులు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లోని పీహెచ్‌సీలో ఉపాధిహామి పథకంలో భాగంగా మండల ఉపాధిహామి ఏపీఓ లక్ష్మన్న, వైద్యులు మిథన్‌రెడ్డి, ప్రసాద్ రెడ్డి తదితరులు పీహెచ్‌సీ ఆవరణలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ నాటిన మొక్కలను సంరక్షించి, పీహెచ్‌సీలో ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు వైద్యులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. కాగా పీహెచ్‌సీలో మొక్కలు నాటడంపై డాక్టర్లు, వైద్య సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు.

సామాజిక తనిఖీ సక్రమంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న జిల్లా విజిలెన్స్ అధికారి సిద్ధలింగమూర్తి

కోడుమూరు రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులపై నిర్వహిస్తున్న సామాజిక తనిఖీలను సోషల్ ఆడిట్ టీమ్ సభ్యులు సక్రమంగా నిర్వహించాలని జిల్లా విజిలెన్స్ అధికారి సిద్ధలింగమూర్తి సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, సోషల్ ఆడిట్ టీమ్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీ పథకం కింద 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి నెలాఖరు వరకు జరిగిన పనులకు సంబంధించిన వివరాలను ఉపాధి సిబ్బంది సోషల్ ఆడిట్ టీమ్ సభ్యులకు అందజేసి, సామాజిక తనిఖీ సజావుగా జరిగేలా సహకరించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎస్ఆర్‌పీ తిరుమలేష్, పీఆర్ ఏఈ గంగరాజు, ఏపీఓ రమాదేవి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


చెక్కును అందజేస్తున్న దాతలు

కల్లూరు: పెద్దపాడు ఏపీ మోడల్ స్కూల్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న శ్రీ బీర లింగేశ్వర స్వామి దేవాలయం, గోపురం నిర్మాణానికి తమ వంతుగా బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ ఎ.శశికళ, కృష్ణమోహన్ దంపతులు రూ.లక్ష పదకొండు వేలు విరాళంగా ఇచ్చారు. సోమవారం దేవాలయం ఆవరణలో కర్నూలు జిల్లా కురువ సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.కే. రంగస్వామి, బి.సి.తిరుపాల్, కోశాధికారి నాగన్న, పాలసుంకన్న, పర్ల ఎంపీటీసీ మేకల శేషన్న తదితరులు సమక్షంలో చెక్కును అందజేశారు.

తపాలా సేవలు వినియోగించుకోవాలి

పాణ్యం: తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలని పోస్టాఫీసు సూపరింటెండెంట్ సత్యనారాయణరావు సూచించారు. సోమవారం పిన్నాపురం గ్రామంలో నూతన బ్రాంచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎల్లక్రిష్ణయ్య, పాణ్యం పోస్టుమాస్టర్ సురేష్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ

పాణ్యం: ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రతాప్, వెంకటాద్రి తదితరుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో దేశ నాయకుల చిత్రపటాలు, 55 అడుగు త్రివర్ణ పతాకంతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

ఉపఎన్నికల్లో ఏకగ్రీవాల జోరు

- ఎక్కువ స్థానాల్లో ఏకగ్రీవంగా వార్డు సభ్యుల ఎన్నిక
- గూడూరు మండలంలో మూడు స్థానాలకు ఒక్కొక్కరు మాత్రమే నామినేషన్
- కర్నూలు రూరల్‌లో నాలుగు, ఓర్వకల్లులో రెండు స్థానాలు ఏకగ్రీవం
- కోడుమూరు మండలంలో పోటీ అనివార్యం


మునగాలలో వార్డు సభ్యులు సరోజకు ధ్రువీకరణపత్రం అందిస్తున్న అధికారులు

గూడూరు రూరల్ : మండల పరిధిలోని మూడు గ్రామాల్లో ఖాళీగా ఉన్న వార్డు సభ్యుల స్థానాల ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడగా, సోమవారం నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసింది. కె.నాగలాపురం, మునగాల, మల్లాపురం గ్రామాలలోని ఒక్కొక్క వార్డు సభ్యుని స్థానం ఖాళీగా ఉండగా గత మూడు రోజులుగా నామినేషన్ల స్వీకరణను అధికారులు నిర్వహించారు. కాగా మూడు స్థానాలకు ఒక్కో నామినేషన్ మాత్రమే రావడంతో ఎంపీడీఓ మాధవీలత ఆ ముగ్గురు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. కె.నాగలాపురం నుంచి బండారి పావని, మునగాల నుంచి బైరిపోగు సరోజ, మల్లాపురం స్థానానికి లక్ష్మీదేవి ఎన్నికయ్యారు. వీరికి అధికారులు ధ్రువీకరణ పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ సునీలమ్మ, పీఆర్ ఏఈ గోపాల్‌రావు, సర్పంచు గోపాల్, సుందరరాజు, డీలర్ మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

కేతవరం, చింతలపల్లె ఏకగ్రీవం

ఓర్వకల్లు: ఖాళీ ఏర్పడిన వార్డు సభ్యుల స్థానాలకు ఈ నెల 19వ తేదీన జరిగే ఉప ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ సోమవారం ప్రశాంతంగా ముగిసినట్లు ఎంపీడీఓ శివనాగప్రసాద్ తెలిపారు. మండలంలో మొత్తం ఐదు గ్రామాలకు గాను కేతవరం, చింతలపల్లె గ్రామాలలో రెండు వార్డు సభ్యుల స్థానాలకు ఏకగ్రీవమైనట్లు అధికారికంగా ప్రకటించారు. మిగతా గ్రామాలైన ఓర్వకల్లు, శకునాల, బ్రాహ్మణపల్లెలో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓర్వకల్లులో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడిగా మారం సతీష్, టీడీపీ మద్దతుదారుడిగా మీనిగ వేణుగోపాల్‌రెడ్డి బరిలో ఉండగా, శకునాలలో టీడీపీ మద్దతుదారులుగా బోయ రమణమ్మ, వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడిగా బోయ చిన్న లక్ష్మయ్య, బ్రాహ్మణపల్లెలో ఇద్దరు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులైన కానుగల రమేష్, కొట్టం మద్దమ్మల మధ్య పోటీ నెలకొనడంతో ఈ మూడు స్థానాలకు ఎన్నికలు అనివార్యమైనట్లు ఎంపీడీఓ వెల్లడించారు.

మూడు వార్డు స్థానాలూ ఏకగ్రీవం

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలంలో నాలుగు వార్డు స్థానాలకు మూడు చోట్ల ఒకే నామినేషన్ దాఖలు కావడంతో అభ్యర్థులు ఏకగ్రీవం అయ్యాయని కర్నూలు ఎంపీడీఓ, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్ అజాంఖాన్ స్పష్టం చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలోని దిగువపాడులో 8వ వార్డుకు వడ్డె వెంకటలక్ష్మి, జి.శింగవరంలో 2వ వార్డుకు కె రాణి, ఆర్‌కే దుద్యాలలో షేక్ సుభాన్‌బాషా 4వ వార్డుకు ఏగ్రీవంగా ఎన్నియ్యారని వెల్లడించారు. ఈ నెల 19వ తేదీన ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు పోలింగ్, అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. అనంతరం గెలిచిన అభ్యర్థులను ప్రకటిస్తామని, అనుకోని సంఘటనలు జరిగితే రీపోలింగ్ ఈ నెల 20వ తేదీన ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. వార్డు స్థానాల నామినేషన్ల ప్రక్రియలో కర్నూలు ఈఓఆర్‌డీ నాగేశ్వర్‌రెడ్డి, పీఆర్ ఏఈ రవిమోహన్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవిమోహన్‌రెడ్డి, కర్నూలు రూరల్ ఎంఈఓ2 వినోద్‌కుమార్ స్టేజ్1 ఆఫీసర్లుగా వ్యవహరించినట్లు ఆయన వెల్లడించారు.

గోరంట్లలో 3, ప్యాలకుర్తిలో 2 అభ్యర్థులు పోటీ

కోడుమూరు : కోడుమూరు మండలంలోని గోరంట్ల గ్రామంలో వార్డుమెంబర్-6, ప్యాలకుర్తి గ్రామంలోని వార్డు మెంబర్-1 స్థానానికి జరుగుతున్న ఎన్నికల్లో భాగంగా సోమవారంతో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసింది. దీంతో గోరంట్ల వార్డు మెంబర్-6 స్థానానికి పుల్లగుమ్మి శ్యామల, లక్ష్మిదేవి, లాలెమ్మ పోటీ పడుతుండగా, ప్యాలకుర్తి వార్డు మెంబర్-1 స్థానానికి సంగాల సుగుణమ్మ, సంజపోగు సుశీలమ్మ లు పోటీ పడుతున్నట్లు ఎన్నికల అధికారులు గంగరాజు, మంజుల తెలిపారు. ఈ మేరకు బరిలో ఉన్న అభ్యర్థులకు గుర్తులను కూడా కేటాయించినట్లు వెల్లడించారు. ఎన్నికల్లో భాగంగా ఈనెల 19వ తేదీన గోరంట్ల, ప్యాలకుర్తి గ్రామాల్లో ఆయా వార్డు మెంబర్ స్థానాలకు ఎన్నికలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

కల్లూరులో మూడు వార్డు స్థానాలు ఎకగ్రీవం

కల్లూరు: మండల పరిధిలోని ఉలిందకొండ గ్రామ పంచాయతీలో 3వ వార్డు, పర్ల గ్రామ పంచాయతీలోని 5, 12వ వార్డులకు ఈ నెల 6న ఉప ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కాగా 8 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ జరిగింది. పర్ల గ్రామ పంచాయతీలోని 5వ, 12వ వార్డులకు ఒకొక్కరే నామినేషన్ దాఖలు చేశారు. సోమవారం నామినేష్ల ఉపసంహరణ గడువు ముగియడంతో 5వ వార్డుకు పి.శేఖర్, 12వ వార్డుకు బి.మహనంది ఎకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎంపీడీఓ జీవీ రమణమూర్తి అధికారికంగా ప్రకటించారు. అలాగే ఉలిందకొండ గ్రామ పంచాయతీ 3వ వార్డు ఉప ఎన్నికల్లో మొత్తం ఆరు మంది నామినేషన్లు దాఖలు చేశారు. అందులో ఐదుగురు ఉపసంహరించుకోగా జి.లక్ష్మిదేవి ఒక్కరే పోటీలో ఉండడంతో ఎకగ్రీవమైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి అచ్యుతానందరెడ్డి తెలిపారు.

మొక్కల పెంపకంతో పచ్చదనం


శరీన్‌నగర్ పాఠశాలలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- వేడుకగా 'నా భూమి-నా దేశం'


ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు

కల్లూరు: మొక్కలు పెంచడంతో పచ్చదనం పెరుగుతుందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకల్లో నా భూమి- నా దేశం కార్యక్రమంలో భాగంగా సోమవారం కల్లూరు అర్బన్ 29వ వార్డులోని శరీన్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వాతావరణంలో పచ్చదనం పెరిగితే కాలుష్యం తగ్గడంతో పాటు క్లోరోఫ్లోరో కార్బన్ ప్రభావం తగ్గుతుందని చెప్పారు. మొక్కలు విరివిగా పెంచడం వల్ల అందరికీ నాణ్యమైన స్వచ్ఛమైన ఆక్సిజన్ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాసులు, లక్ష్మీకాంతరెడ్డి, వెంకటేశ్వర్లు, నారాయణరెడ్డి, శ్వేతారెడ్డి, కల్లూరు జేసీఎస్ ఇన్‌చార్జ్ గోవర్ధన్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

గూడూరులో 'నా భూమి- నా దేశం'

గూడూరు: పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం మున్సిపల్ అధికారులు 'నా భూమి - నా దేశం' కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, కమిషనర్ ప్రసాద్‌గౌడ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు. హెచ్‌ఎం జయమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గోరుకల్లు సీమకే తలమానికం

- జలహారతి కార్యక్రమంలో ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి


గోరుకల్లులోని లోపలి భాగాన్ని పరిశీలిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

పాణ్యం: గోరుకల్లు ప్రాజెక్టు యావత్తు సీమకే తలమానికమని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం గోరుకల్లులో నిర్వహించిన జలహారతి కార్యక్రమానికి హాజరై నిర్మాణాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ 2004లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గోరుకల్లు ప్రాజెక్టు నిర్మాణాలకు నిధులు కేటాయించి, దాదాపుగా 80శాతం వరకు పనులు పూర్తి చేశారన్నారు. గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టు గురించి ఆలోచించక పోవడమే కాక ప్రచారం కోసం పూర్తి చేసినట్లు శిలాఫలకాలు వేయడం సిగ్గు చేటన్నారు. ప్రచారం ఆర్భాటాలకు పోయి 2016లో ప్రాజెక్టు పూర్తి కాకుండానే నీరు నిల్వ చేయడంతోనే లీకేజీలు వచ్చాయని గుర్తు చేశారు. అనాటి నుంచి వారు దిగిపోయేంత వరకు ఒక్క రూపాయి కేటాయించలేదన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ గోరుకల్లు పెండింగ్ పనుల పూర్తి చేసేందుకు రూ.100కోట్లు కేటాయించారన్నారు. అలాగే అదనంగా మరో రెండు గేట్లు పెంచారని చెప్పారు. ప్రాజెక్టుకు అదనంగా మరో ఒకటిన్నర టీఎంసీ నిల్వ పెంచేందుకు ప్రతిపాదనలు పంపామన్నారు. కట్ట కుంగగానే కేవలం నెల రోజుల మరమ్మతు పనులు చేసిన గ్రీన్ కో యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. అహర్నిశలు శ్రమించి పనులు చేసిన సిబ్బందికి అభినందనలు తెలిపారు.సీఈ కబీర్‌బాషా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఈఈ సుభకుమార్, కరుణాకర్‌రెడ్డి, షేక్షావలి, సుబ్బారెడ్డి, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

'స్పందన' అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు

కోడుమూరు రూరల్ : స్పందన కార్యక్రమంలో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల ప్రజల నుంచి వచ్చే అర్జీల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. స్పందనలో డిప్యూటీ తహసీల్దార్ రామాంజినేయులు, ఎంఈఓ శరభయ్య, ఏపీఎం పుష్పావతి, లైబ్రేరియన్ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

గూడూరు: స్పందనలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్ శివశంకర్ నాయక్ తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించి వినతి పత్రాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఐదుగురు అర్జీలు ఇచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. ఎంపీడీఓ మాధవీలత, వైకేపీ ఏఈఎం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

'సుంకేసుల'లో 0.990 టీఎంసీల నీరు

గూడూరు: సుంకేసుల జలాశయంలో 0.990 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు డ్యాం అధికారులు సోమవారం తెలిపారు. ఇన్ ఫ్లో నిలిచి పోయిందని పేర్కొన్నారు.

'మన సచివాలయం-మన ఎమ్మెల్యే' వాయిదా

గూడూరు రూరల్: పెంచికలపాడులో సోమవారం నిర్వహించాల్సిన మన సచివాలయం-మన ఎమ్మెల్యే కార్యక్రమం వాయిదా పడినట్లు ఎంపీడీఓ మాధవీలత తెలిపారు. ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కారం చూపేందుకు ఎమ్మెల్యే సుధాకర్ మన సచివాలయం-మన ఎమ్మెల్యే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని, అనారోగ్యం కారణంగా వాయిదా వేయడం జరిగిందని పేర్కొన్నారు.

రుణాలకు దరఖాస్తు చేసుకోండి

గూడూరు: పట్టణంలోని చిరు వ్యాపారులు పీఎం స్వనిధి పథకం కింద బ్యాంకు రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ ప్రసాద్‌గౌడ్ సూచించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మెప్మా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ టిఫిన్ సెంటర్స్, టీ కొట్లు, కూర గాయల వ్యాపారులు, పచ్చళ్లు అమ్మే వారు, అప్పడాల తయారీ, తదరత వ్యాపారులను మెప్మా సిబ్బంది కలిసి, బ్యాంకు రుణాలపై అవగాహన కల్పించాలని సూచించారు.

పంట నమోదు పకడ్బందీగా చేపట్టాలి

కోడుమూరు రూరల్ : రైతులు సాగు చేసిన ప్రతి పంటను ఈ-పంట నమోదు యాప్‌లో పకడ్బందీగా నమోదు చేయాలని ఏఓ రవిప్రకాష్ సూచించారు. సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మండలంలోని ఆర్‌బీకేల సిబ్బందితో సమావేశమై, పంట నమోదుపై పలు సూచనలిచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ లో రైతులు ఏయే పంటలు సాగు చేశారో వాటిని మాత్రమే నమోదు చేయాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

లారీల పట్టివేత

కర్నూలు (న్యూసిటీ) : నాపరాయి, కలర్ బండలను అక్రమంగా తరలిస్తున్న రెండు లారీలను దాడి చేసి పట్టుకున్నట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ సోమవారం తెలిపారు. ఆదివారం రాత్రి వీటిని ఓర్వకల్లు వద్ద స్వాధీనం చేసుకొని పోలీసుస్టేషన్‌లో భద్రపరిచామని చెప్పారు. లారీ యజమానులు శేషు, శ్రీనివాసులు ఇద్దరూ బేతంచెర్లకు చెందిన వారిగా గుర్తించామని తెలిపారు. నాపరాయి లారీ యజమానికి రూ.40 వేలు, కలర్ బండల లారీ యజమానికి రూ.30.228 జరిమానా విధించినట్లు చెప్పారు. తనిఖీలో మైనింగ్ అధికారులు బాలు నాయక్, సిబ్బంది ఉన్నారు.

గోమాతను రక్షించండి

ఓర్వకల్లు: ప్రతి ఒక్కరూ గోమాతను పరిరక్షించి, గోవిందుడి నామాన్ని స్మరించుకొని హిందూ ధర్మాన్ని చాటి చెప్పాలని సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి దేవస్థాన పీఠాధిపతి బాలకృష్ణ గురుస్వామి అన్నారు. ఈనెల 6 నుంచి చేపట్టిన గో మహా పాదయాత్ర సోమవారం హుసేనాపురం గ్రామానికి చేరుకుంది. పాదయాత్ర బృందానికి స్థానికలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బాలకృష్ణ గురుస్వామి గోమాత విశిష్టత, ప్రయోజనాలను భక్తులకు వివరించారు.

అందరి నమ్మకం జగనన్నే

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్


పడిదెంపాడులో లబ్దిదారుడికి బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్


ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, తదితరులు

కర్నూలు (న్యూటౌన్): అందరి నమ్మకం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. సోమవారం కర్నూలు మండలం పడిదెంపాడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయంలో పూజల అనంతరం ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లలో పొందిన లబ్ధిని వివరించి, సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. ఇంకా ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పడిదెంపాడు - పూడూరు గ్రామాలకు రూ.11.85 కోట్లతో రోడ్డు నిర్మాణానికి త్వరలో టెండర్లు పిలుస్తామన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా పాలన సాగిస్తున్న జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రవిశాస్త్రి, కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ2 నెహమ్యా, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, సొసైటీ చైర్మన్ శేషిరెడ్డి, మండల మాజీ ఉపాధ్యక్షులు వాసు, సచివాలయ కన్వీనర్లు వెంకటేశ్వర్లు, సురేష్, సర్పంచ్ విద్యాసాగర్, వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు అబ్దుల్‌మజీద్, ఎంపీడీఓ అజాంఖాన్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం

14కెఎన్ఎల్38: ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, ఏపీఎంలు, సీసీలు

కర్నూలు (న్యూటౌన్): స్టాంటన్‌పురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో డీఆర్‌డీఏ - వైకేపీ కోడుమూరు నియోజకవర్గంలోని ఏపీఎంలు, సీసీలు ఎమ్మెల్యే సుధాకర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకేలు అందజేశారు. అనంతరం 23 శాతం పీఆర్‌సీ ప్రభుత్వం అమలు చేయడంతో ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉద్యోగులకు ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎంలు మల్లికార్జునస్వామి, వెంకటస్వామి, సుధాకర్, పుష్పలత, సీసీలు పాల్గొన్నారు.